జగనన్న కాలనీల్లో విద్యుత్తు వెలుగులు

- సబ్ డివిజన్‌లో తొలి విడతగా 28 చోట్ల విద్యుదీకరణ
- చురుగ్గా సాగుతున్న పనులు
- 16 లే అవుట్లలో ఇప్పటికే పనులు పూర్తి
- మరో 20 లేవుట్లలో పనులకు ప్రతిపాదనలు
- సర్వీసు వైరుతో సహా లబ్ధిదారుల ఇళ్లకు ఉచితంగా మీటర్ల బిగింపు
- 43 కాలనీల్లో 10,006 మందికి చేకూరుతున్న లబ్ధి


కొవ్వూరు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైన్లు


కొవ్వూరు జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్

కొవ్వూరు: జగనన్న కాలనీల్లో విద్యుత్ లైన్ల ఏర్పాటు పనులు శరవేగంగా సాగుతున్నాయి.

కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలోని 28 కాలనీల్లో మొదటి విడతగా రూ.3.99 కోట్లతో ఈ పనులు చేపట్టారు. ఇప్పటికే 276 గృహాలకు కరెంట్ కనెక్షన్లు ఇచ్చారు. మరో 307 ఇళ్లకు కరెంట్ సర్వీసులు ఇచ్చేందుకు రిజిస్టర్ చేశారు. పక్కా గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు కరెంటు ఖర్చులు ఆదా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వీసు వైరు, మీటర్, బోర్డు, ఎర్త్ పైప్ వంటివి విద్యుత్తు శాఖ ద్వారా ఉచితంగా అందిస్తోంది. లబ్ధిదారులు కేవలం ఇంటి లోపలి వైరింగ్ పనులు చేయించుకుంటే సరిపోతుంది. చాగల్లు, కొవ్వూరు మండలాలు, కొవ్వూరు మున్సిపాలిటీ పరిధిలో 43 జగనన్న కాలనీలు ఉన్నాయి. వాటిలో మొదటి విడతగా 28 కాలనీల్లో విద్యుదీకరణ పనులు చేపట్టారు. ఇప్పటికే కొవ్వూరు సబ్ డివిజన్ పరిధిలోని తోగుమ్మి, నందమూరు, కాపవరం, దొమ్మేరు-1,2, ఐ.పంగిడి-1, దేచెర్ల, చాగల్లు-1,2, పశివేదల, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం-1,2 గ్రామాలతో పాటు కొవ్వూరు పట్టణ పరిధిలోని మూడు కాలనీలతో కలిపి మొత్తం 16 కాలనీల్లో పనులు పూర్తి చేశారు. 3,426 గృహాలకు విద్యుత్తు సదుపాయం సమకూర్చేందుకు లైన్లు వేశారు. రెండో విడతలో రూ.నాలుగు కోట్ల వ్యయంతో చాగల్లు, తాళ్లపూడి మండలాల్లో విద్యుదీకరణ పనులకు అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఈ నిధులు మంజూరు కావాల్సి ఉంది.

106.7 కిలో మీటర్ల పొడవునా విద్యుత్తు లైన్లు

తొలి విడతలో మంజూరైన 28 జగనన్న కాలనీల్లో 6,700 విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేయనున్నారు. వాటిలో ఇప్పటికే 2,347 విద్యుత్తు స్తంభాలను ఏర్పాటు చేశారు. 11 కేవీ విద్యుత్‌లైన్లు 2.7 కిలోమీటర్ల పొడవునా, ఎల్‌టీ లైన్ 104 కిలోమీటర్ల పొడవునా పూర్తి చేశారు. మరో1,004 స్తంభాల ఏర్పాటు పనులు పురోగతిలో ఉన్నాయి. తొలిదశలోని 28 కాలనీల్లో 140 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనున్నారు. వీటిలో 16 కేవీ నుంచి 160 కేవీ వరకూ వివిధ సామర్థ్యాలతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తారు.16 కాలనీల్లో 3,426 పక్కా గృహాలకు విద్యుత్ లైన్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తి చేశారు. ఇప్పటికే 43 జగనన్న కాలనీల్లో 38 చోట్ల తాగునీటి వసతి, రాడ్ బెండింగ్, నీటి సరఫరా నిమిత్తం 38 విద్యుత్తు మోటారు సర్వీసులు ఇచ్చారు. ఇందు కోసం రూ.1.49 కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. ఐదుచోట్ల స్థానికంగా నీటి వసతి, సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.

ఫిబ్రవరి15కు పనులు పూర్తి చేస్తాం



కొవ్వూరు సబ్ డివిజన్‌లో మొదటి విడతలో మంజూరైన పనులను 15 రోజుల్లో పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. 28 జగనన్న కాలనీల్లో పనులు ప్రారంభించి, ఇప్పటికే 16 కాలనీల్లో పనులను పూర్తిచేశాం.రెండో విడతలో చాగల్లులో 14, తాళ్లపూడి మండలంలో ఐదు కాలనీల్లో పనులు చేపట్టేందుకు సుమారు రూ.4 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

–పి.అచ్యుతాచారి, డీఈఈ, కొవ్వూరు

మొత్తం జగనన్న కాలనీలు	:	43
ప్లాట్ల సంఖ్య	:	10,006
తొలి విడతలో విద్యుదీకరణ మంజూరైన కాలనీలు	:	28
మంజూరైన నిధులు	:	రూ.3,99,34,098
మొదటి విడతలో కవరయ్యే ప్లాట్ల సంఖ్య	:	9,022
పనులు పూర్తయిన కాలనీలు	:	16
పనులు పూర్తి చేసుకున్న కాలనీల్లో కవరయ్యే ప్లాట్ల సంఖ్య	:	3,426
ఉచితంగా విద్యుత్ సర్వీసు అందించిన ఇళ్ల సంఖ్య	:	276
విద్యుత్తు సర్వీసుల కోసం రిజిస్టర్ అయిన ఇళ్ల సంఖ్య	:	307

క్లుప్తంగా

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కొవ్వూరు: ఈ నెల 27వ తేదీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ ఈఈ బి.వీరభద్రరావు తెలిపారు. పశివేదల, దొమ్మేరు, ఐ.పంగిడి, ఆరికిరేవుల, కుమారదేవం, దేచెర్ల గ్రామాల 33/11కేవీ సబ్‌స్టేషన్ల మరమ్మతుల నిమిత్తం సరఫరాను నిలిపివేస్తామన్నారు.ఈ గ్రామాల పరిధిలోని వ్యవసాయ, గృహ విద్యుత్తు సర్వీసులకు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.అలాగే శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ కొవ్వూరు 132 కేవీ సబ్‌స్టేషన్, వాడపల్లి సబ్ స్టేషన్ల పరిధిలో కూడా వార్షిక మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ తెలిపారు. ఈ కారణంగా కొవ్వూరు పట్టణంలోను, వాడపల్లి, తోగుమ్మి, వేములూరు, మద్దూరు, సీతంపేట, మద్దూరులంక గ్రామాల్లో గృహ, వ్యవసాయ సర్వీసులకు సరఫరా నిలిచిపోతుందన్నారు.

చాగల్లు మండలంలో..

చాగల్లు: చాగల్లు, ఊనగట్ల సబ్‌స్టేషన్ల పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఎలక్ట్రికల్ ఈఈ (ఆపరేషన్స్) పి.వీరభద్రరావు తెలిపారు. వార్షిక మరమ్మతుల నిమిత్తం చాగల్లు, మీనానగరం, నెలటూరు, ఊనగట్ల, నందిగంపాడు, ఎస్.ముప్పవరం గ్రామాల్లో గృహ , వ్యవసాయ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ప్రకటించారు.

కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులు క్రమబద్ధీకరించాలి

నల్లజర్ల: గత 20 ఏళ్లుగా వైద్య, ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమ సర్వీసులను ఈ రిపబ్లిక్ దినోత్సవం రోజునైనా క్రమబద్ధం చేయాలని పారా మెడికల్ సిబ్బంది కోరుతున్నారు. పారామెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాద్ బుధవారం నల్లజర్లలో విలేకరులతో మాట్లాడారు. డీఎస్సీ కాంటాక్ట్ పారా మెడికల్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ ద్వారా రాత పరీక్ష, ఆర్డర్ ఆఫ్ మెరిట్, క్లియర్ వేకెన్సీ, శాంక్షన్ పోస్టుల్లో నియామకం పొంది 20 సంవత్సరాలుగా వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్నామన్నారు. అన్ని అర్హతలూ ఉన్న డీఎస్సీ కాంట్రాక్టు మెడికల్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు.

కోర్టు హాల్లో న్యాయవిజ్ఞాన సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ కృష్ణప్రసాద్

నిడదవోలు: ఫిబ్రవరి 11న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని నిడదవోలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. నిడదవోలు కోర్టు హాల్లో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాజీ పడదగిన కేసుల పరిష్కారానికి అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.అర్జునుడు, సీనియర్ న్యాయవాదులు నక్కా వెంకటేశ్వర్లు, చాపల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ జామ్

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం బ్రిడ్జి వద్ద గడ్డర్‌ను వాహనం ఢీ కొట్టడంతో బుధవారం సాయంత్రం భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనాలు బారులు తీరాయి. సుమారు గంటసేపు వాహనలు వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమిశ్రగూడెం పోలీసులు బ్రిడ్జి వద్దకు చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

పాదయాత్ర విజయవంతం కావాలంటూ పూజలు

నిడదవోలు రూరల్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఈనెల 27న చేపట్టే యువగళం పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ మండలంలోని తిమ్మరాజుపాలెంలోని కోటసత్తెమ్మ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక పూజలు బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొమ్మిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అనారోగ్యంతో హెడ్ కానిస్టేబుల్ మృతి


ఈశ్వరరావు (ఫైల్)

దేవరపల్లి: దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న (58) ఈశ్వరరావు బుధవారం మృతి చెందాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మెరుగైన వైద్యం కోసం ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్టు స్థానిక ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

ఎస్‌వీఆర్‌కే డిగ్రీ కళాశాల్లో ఫ్రెషర్స్ డే

నిడదవోలు: విద్యార్థులందరూ స్నేహ భావంతో మెలగడంతో పాటు ఉన్నతంగా ఎదగాలని నిడదవోలు ఎస్‌వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి అన్నారు. ఆ కళాశాల్లో బీకామ్ గ్రూపుల విద్యార్థులు ఫ్రెషర్స్ డేను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పలు ప్రతిభా పోటీల్లో రాణించిన విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఇ.నాగేశ్వరరావు అధ్యాపకులు పీఎస్ఎస్ స్రవంతి, ఎస్ఎన్‌డీ లక్ష్మీదేవి, జి.ప్రకాశం, కె.జాస్మిన్, ప్రసాదరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగాలమ్మ ఊరేగింపు


వెలగదుర్రు గంగాలమ్మ జాతరలో శక్తివేశాలు

ఉండ్రాజవరం: మండలంలోని వెలగదుర్రు గ్రామంలో రజక సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం గంగాలమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి గ్రామోత్సవంలో ఆసాదుల నృత్యాలు, డప్పు వాయిద్యాలు, బేతాళ నృత్యాలు, తీన్‌మార్ వాయ్యిదాల సందడిల అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఊరేగించారు. నిర్వాహకులు కాకరపర్తి గడ్డియ్య, అవిడి మారియ్య, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ బీఎల్‌ఓగా అరుణకుమారి


రాష్ట్రస్థాయి ఉత్తమ బీఎల్‌ఓ పురస్కారం అందుకుంటున్న అరుణకుమారి



కలెక్టర్ మాధవీలత నుంచి ఉత్తమ బీఎల్‌వో అవార్డు అందుకుంటున్న నాగాంబిక

నిడదవోలు రూరల్: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని విజ్జేశ్వరానికి చెందిన మహిళా పోలీస్ జి.అరుణకుమారికి రాష్ట్రస్థాయిలో ఉత్తమ బీఎల్‌ఓ పురస్కారాన్ని బుధవారం అందుకున్నారు. ఎన్నికల ప్రక్రియ విధులను సమర్థవంతంగా నిర్వహించినందుకు విజ్జేశ్వరం పోలింగ్ స్టేషన్-72 బీఎల్‌ఓ అరుణకుమారికి జిల్లా బెస్ట్ ఎలక్టోరల్ అవార్డుకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి చేతుల మీదుగా అరుణకుమారి ఈ అవార్డు అందుకున్నారు. అరుణకుమారిని తహసీల్దార్ ఎం.గంగరాజు, సర్పంచ్ తిక్కా శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది అభినందించారు.

జిల్లాస్థాయి ఉత్తమ బీఎల్‌వోగా నాగాంబిక

దేవరపల్లి: ఉత్తమ బూత్ లెవెల్ అధికారిణి (బీఎల్‌వో)గా దేవరపల్లి మూడో గ్రామ సచివాలయం సంక్షేమ అధికారి కరణం నాగాంబిక ఎంపికయ్యారు. అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం రాజమహేంద్రవరంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కె.మాధవీలత చేతుల మీదుగా నాగాంబిక ఈ అవార్డు అందుకున్నారు. నాగాంబికను తహసీల్దార్ ఎం.రామకృష్ణ, ఎంపీడీఓ కె. ఉమామహేశ్వరశర్మ తదితరులు అభినందించారు.

సాయినాథుని మందిరంలో గణపతి హోమం

కొవ్వూరు: స్థానిక గోష్పాద క్షేత్రంలోని షిర్డీ సాయినాథుని ఆలయం వద్ద బుధవారం శ్రీమహాగణపతి యాగం, హోమం నిర్వహించారు. సాయంత్రం భక్తులు సామూహిక హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. రాత్రి ఏడు గంటల నుంచి అక్కిరాజు శ్రీనివాస్ బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత విభావరి ఆకట్టుకుంది. గురువారం ఉదయం సాయి నాథునికి ఏకాదశ రుద్రాభిషేకం, అర్చన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం చింతా రవి బాలకృష్ణ బృందం కూచిపూడి నృత్య కదంబం నిర్వహిస్తారన్నారు.

పూర్తయిన గ్రామ సచివాలయ కన్వీనర్ల నియామకం


నియామక పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తదితరులు

గోపాలపురం: గ్రామ సచివాలయాల కన్వీనర్ల నియామకం పూర్తయినట్టు మండల సచివాలయ కన్వీనర్ తానింకి సత్యనారాయణ చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని 18 గ్రామ సచివాలయాలకు గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అందజేసిన నియామక పత్రాలను బుధవారం ఆయా గ్రామల కన్వీనర్లకు అందజేశామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఆదేశాల ప్రకారం గ్రామ కమిటీ కన్వీనర్ల సమన్వయంతో పార్టీ కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పని చేస్తామని సత్యనారాయణ చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు, పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలకు నగదు పురస్కారాలు


నల్లజర్లలో విజేతలకు నగదు బహుమతులు అందిస్తున్న పార్థ్ ఇండియా సంస్థ సభ్యులు

నల్లజర్ల: రిపబ్లిక్ డే సందర్భంగా పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ మండల స్థాయిలో 8,9,10 తరగతుల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. తొలుత 23న గ్రామ స్థాయిలో తొమ్మిది జెడ్పీ హైస్కూళ్లలో నిర్వహించిన టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతులు అందజేశారు. 25న మండల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు పంపన అనూష (జడ్పీహైస్కూలు.దూబచర్ల) రూ.రెండు వేలు, ఏఎన్ఎస్ సూర్యప్రసాద్ (జెడ్పీహెచ్, ప్రకాశరావుపాలెం) రూ.1500, జి.ఓటెడ్ (పోతవరం జెడ్పీ హైస్కూల్) రూ.1000 చొప్పున నగదు పురస్కారాలను బుధవారం నల్లజర్ల జెడ్పీ హైస్కూల్లో అందజేశారు. కారుమంచి గణేశ్ తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నల్లజర్ల, దేవరపల్లి మండలాల్లో ఈ పోటీలు నిర్వహించినట్టు పార్థ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు తెలిపారు.కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్ఎం లక్ష్మి, షేక్ ఇలియాస్ షరీఫ్, దుర్గా హాస్పిటల్ డాక్టరు బద్రి వీరశేఖరరావు, బొందల శ్రీనివాసరావు, పచ్చిగోళ్ల శ్రీనివాస్, సీమకుర్తి ప్రసాద్, సీహెచ్ మనోహరకుమార్ పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాల జోలికి పోవద్దు

- ఎవరైనా విక్రయిస్తుంటే సమాచారం ఇవ్వండి
- ఎస్ఈబీ సీఐ సుధ


దేవరపల్లి సదస్సులో విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎస్ఈబీ సీఐ సుధ

దేవరపల్లి: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) సీఐ డి.సుధ విద్యార్థులకు సూచించారు. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్, ఎస్ఈబీ సంయుక్తంగా నిర్వహించిన ఈ సదస్సులో సీఐ సుధ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలను విక్రయిస్తున్నట్టు తెలిస్తే పోలీస్, ఎస్ఈబీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. కార్యక్రమంలో దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్సై కె. శ్రీహరిరావు, గోపాలపురం ఎస్సై రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజం కావాలి

గోపాలపురం: డ్రగ్స్ రహిత సమాజ సాధనకు ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా సహకరించాలని దేవరపల్లి సీఐ అనసూరి శ్రీనివాసరావు కోరారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల దుష్పరిణామాలపై బుధవారం స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల, జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ సాధనకు యువత పాటు పడాలన్నారు.ఎస్ఈబీ సీఐ కె.సుధ, ఎస్ఐ కె. రామకృష్ణ, సొసైటీ చైర్మన్ కూసం రామమోహన్‌రెడ్డి, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ గుంజే వెంకటరమణ విద్యార్థులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు అంగన్‌వాడీల ధర్నా


కొవ్వూరు: అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ మాణిక్యాంబ కోరారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు బుధవారం ధర్నా చేశారు. గ్రాట్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మెనూ చార్జీలు పెంచాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టీఏ బిల్లులను చెల్లించాలని కోరారు. గ్రేడ్-2 సూపర్‌వైజర్ల పోస్టుల భర్తీకి విధించిన వయో పరిమితిని సడలించాలని, హెల్పర్ల పదోన్నతి వయస్సును 50 ఏళ్లకు పెంచాలని, 300 జనాభా దాటిన మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లలో విలీనం చేసి వర్కర్‌తో సమానంగా వేతనం ఇవ్వాలని కోరారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు, పెన్షన్ కింద సగం వేతనం చెల్లించాలని కోరుతూ సీడీపీవో డి.మమ్మీకి వినతి పత్రం అందజేశారు.

నిడదవోలు రూరల్: అంగన్‌వాడీలకు కనీస వేతనంగా రూ.26 వేలు చెల్లించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు బి.మేరీ విక్టోరియా కోరారు. అంగన్‌వాడీల సమస్యలపై బుధవారం వారు సమిశ్రగూడెంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సీడీపీఓ ఎ.ఆశారోహిణికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు, సభ్యులు కె.సూర్యకాంతం, మాధవి, విజయకుమారి, కె.లక్ష్మి, ఎ. శ్రీదేవి పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం

- ఇన్‌చార్జ్ ఆర్డీవో గీతాంజలి
- గ్రామగ్రామానా ఓటరు దినోత్సవం
- సీనియర్ సిటిజన్లకు సన్మానం


కొవ్వూరులో సీనియర్ ఓటర్లకు సత్కారం. చిత్రంలో ఇన్‌చార్జ్ ఆర్డీవో గీతాంజలి తదితరులు


నిడదవోలు మండలం తాడిమళ్లలో సీనియర్ ఓటర్లను సన్మానిస్తున్న ఎంపీపీ భాగ్యలక్ష్మి,అధికారులు

కొవ్వూరు: ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం అని, ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవాలని కొవ్వూరు ఇన్‌చార్జ్ ఆర్డీవో కె.గీతాంజలి సూచించారు. డివిజనల్ రెవెన్యూ కార్యాలయంలో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఓటు ప్రాముఖ్యతపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువతకు ఆర్డీవో చేతులమీదుగా ఓటరు గుర్తింపు కార్డులు అందజేశారు. ఐదుగురు సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించారు. నలుగురు బూత్ లెవెల్ అధికారులకు ఉత్తమ సేవా పురస్కారాలు అందించి సత్కరించారు. అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ కమల్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.కాగా కొవ్వూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో బుధవారం మాక్ పోలింగ్ ద్వారా విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ, ఓటు ప్రాముఖ్యత గురించి ప్రాక్టికల్‌గా వివరించారు. ప్రిన్సిపాల్ జె.సునీత, అధ్యాపకులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పలు పంచాయతీ కార్యాలయాల వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. సీనియర్ సిటిజన్లను సత్కరించారు. బల్లిపాడులో సర్పంచ్ ఎల్లిన శివ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పెద్దేవం జెడ్పీ హైస్కూల్ వద్ద విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు.

చాగల్లు: బ్రాహ్మణగూడెం జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఊనగట్ల సొసైటీ అధ్యక్షుడు ఆత్కూరి దొరయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గారపాటి శ్రీనివాస్, ఉప సర్పంచ్ ప్రత్తిపాటి సుబ్బారావు, రెవెన్యూ అధికారులు, ఉపాధ్యాయులు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో సీనియర్ ఓటర్లను సత్కరించారు.

నల్లజర్ల: స్థానిక ఎస్ఆర్‌కే కళాశాల్లో సీనియర్ ఓటరు మద్దూరి కామేశ్వరశాస్త్రిని సత్కరించారు. ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించి, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కంఠమణి నారాయణప్రసాద్, ప్రిన్సిపాల్ కండెపు సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దారు వర్దనపు కిశోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: స్థానిక జెడ్పీ హైస్కూల్లో తహసీల్దార్ బి. రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సత్కరించారు. గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఓటు అవగాహన ర్యాలీ నిర్వహించి వైఎస్సార్ జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎంఈఓ జి. శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిడదవోలు రూరల్: వివిధ గ్రామాల్లో బీఎల్‌ఓలు, అధికారుల ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. తాడిమళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి ప్రసంగిస్తూ 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు పొందాలని సూచించారు. సర్పంచ్ బయ్యే రాధారాణి, పంచాయతీ కార్యదర్శి టి.గోపాలకృష్ణ, పెండ్యాల, సమిశ్రగూడెం, విజ్జేశ్వరం గ్రామాల్లో సీనియర్ ఓటర్లను సన్మానించి, ఓటు హక్కు ప్రాధాన్యతను వివరించారు.

పెరవలి: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ సీనియర్ ఓటర్లను సన్మానించారు. తహసీల్దార్ టి.రాజరాజేశ్వరి ఆధ్వర్యంలో కొత్త ఓటర్లు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఎంఈఓ డి.హైమావతి, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.